# నమస్తే తెలంగాణ

## ములుగు జయశంకర్ భూపాలపల్లి

5 | వరంగల్, శనివారం 17 ఆగస్టు 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY


■ ఊరూరా సామూహిక వ్రతాలు
■ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు

## వరలక్ష్మీ నమోస్తుతే..



ఎంజీఎం సెంటర్‌లోని రాజరాజేశ్వరి ఆలయంలో ..



ప్రత్యేకాలంకరణలో భద్రకాళీ అమ్మవారు



ఆలయంలో అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

నమస్తే నెట్‌వర్క్, ఆగస్టు 16: వరాలిచ్చే తల్లి మహాలక్ష్మిని మహిళలు భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. శ్రావణ రెండో శుక్రవారాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలతోపాటు కుంకుమార్చన పూజలు చేశారు. ముత్తయిదువలు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు ఇండ్లల్లో అమ్మ వారి చిత్రపటాలు, విగ్రహాలకు తీరొక్క నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. అష్టైశ్వర్యాలతో, అయురారోగ్యాలతో విలసిల్లాలని మొక్కులు చెల్లించుకున్నారు. సౌభాగ్యాన్ని ప్రసాదిస్తూ తమ కుటుంబ సభ్యులను చల్లగా చూడాలని వేడుకున్నారు. భూపాలపల్లిలోని శ్రీకృష్ణ గీతా మందిరం, కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి, వరంగల్‌లోని భద్రకాళి, హనుమకొండలోని వేయి స్తంభాల రుద్రేశ్వరాలయం, తదితర ఆలయాల్లో అర్చకులు మహిళలతో సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలు చేయించారు.

## నేడు వైద్య సేవలు బంద్

అత్యవసర సేవలకు మినహాయింపు

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 16: దేశవ్యాప్తంగా వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బందిపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ కమిటీ పిలుపు మేరకు శనివారం బంద్ పాటిస్తున్నట్లు ఐఎంఏ వరంగల్ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ బాషా తెలిపారు. నేడు ఉదయం 6 నుంచి 18వ తేదీ ఉదయం 6 గంటల వరకు వైద్య సేవలు నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని సుమారు 400 హాస్పిటళ్లతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాల విద్యార్థులు సైతం బంద్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. నేడు వరంగల్ ఐఎంఏ భవన్ నుంచి కాకతీయ మెడికల్ కళాశాల వరకు నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ సైతం నిరసనకు మద్దతు తెలుపుతున్నట్లు అధ్యక్షుడు డాక్టర్ జి.చంద్రశేఖర్ తెలిపారు. 24 గంటలపాటు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు అవుతామని పేర్కొన్నారు. ఈ మేరకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళికి వినతిపత్రం అందజేసినట్లు వెల్లడించారు.

## మెరుగైన వైద్యం అందించాలి

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్

ములుగు, ఆగస్టు16(నమస్తేతెలంగాణ): ములుగు జిల్లాలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలకు వైద్యులు మెరుగైన చికిత్స అందించాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అమర్‌సింగ్ అన్నారు. శుక్రవారం ఆయన డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్యతో కలిసి ములుగు ప్రభుత్వ దవాఖాన, పస్రా పీహెచ్‌సీ, పోచాపూర్‌లో ఏర్పాటు చేసిన కంటైనర్ దవాఖానను సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్యాన్ని పరిశీలించడంతో పాటు వారితో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కంటైనర్ ద్వారా దవాఖాన ఏర్పాటు చేసి, వైద్య సేవలు అందించడంపై జిల్లా యంత్రాంగాన్ని ఆయన అభినందించారు. ఆర్ఎంవో ప్రవీణ్‌కుమార్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌లాల్, జోనల్ మలేరియా ఆఫీసర్ సునీల్, వైద్యులు మధు, పవన్, నాగయ్య, మలేరియా ఆఫీసర్ దుర్గారావు ఉన్నారు.



ములుగు దవాఖానలో మందులను పరిశీలిస్తున్న అమర్‌సింగ్

**చెత్త సేకరణ వివరాలు తెలుసుకునేందుకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ప్రతి రోజూ ఎక్కడినుంచి ఎంత చెత్త సేకరిస్తున్నామనే కచ్చితమైన సమాచారమేమీ లేక సేకరణ లక్ష్యం వంద శాతం నెరవేరడం లేదు. ఈక్రమంలో సాంకేతికను అందిపుచ్చుకుంటూ ఆర్ఎఫ్ఐడీ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా లెక్కలు తేల్చేపనిలో పడ్డారు. ప్రయోగాత్మకంగా కమర్షియల్ జోన్లలో ఈ కొత్త విధానం అమలవుతుండగా త్వరలో గ్రేటర్ అంతటా ప్రారంభించి ప్రతిరోజూ ఎన్ని ఇళ్ల నుంచి ఎంత సేకరిస్తున్నారనే వివరాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది.**

-వరంగల్, ఆగస్టు 16






చెత్త సేకరించిన తర్వాత స్కానర్‌ను ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌తో స్కానింగ్ చేస్తున్న పారిశుధ్య కార్మికుడు,(ఇన్‌సెట్) షాపు వద్ద ఏర్పాటు చేసిన ఆర్ఎఫ్ఐడీ స్కానర్

# చెత్త సేకరణ లెక్క పక్కాగా

కొత్త విధానానికి శ్రీకారం చుట్టిన జీడబ్ల్యూఎంసీ

■ ఆర్ఎఫ్ఐడీ ట్రాకింగ్‌తో తేలనున్న వివరాలు
■ ప్రయోగాత్మంగా కమర్షియల్ జోన్లలో అమలు
■ 11వేల షాపుల్లో స్కానర్ల ఏర్పాటు
■ త్వరలో గ్రేటర్ అంతటా ప్రారంభం

గ్రేటర్ వరంగల్‌లో చెత్త సేకరణ లెక్క అస్తవ్యస్తంగా ఉంది. రోజుకు ఎన్ని ఇళ్లలో చెత్త సేకరణ జరుగుతున్నది? ఎక్కడినుంచి ఎంత వస్తున్నది? అనే లెక్కలు కార్పొరేషన్ వద్ద లేవు. రోజుకు 450 మెట్రిక్ టన్నుల చెత్త వస్తున్నదన్న గుడ్డి లెక్క మాత్రమే ఉంది. గ్రేటర్‌లోని సుమారు 2.70 లక్షల గృహాల నుంచి ప్రతి రోజూ చెత్త సేకరించాల్సి ఉంది. అయితే ప్రతిరోజూ ఎన్ని గృహాల నుంచి చెత్త సేకరిస్తున్నారనే దానిపై అధికారులకు ఎలాంటి సమాచారం లేదు. ఈ సమస్యను అధిగమించేందుకు రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్(ఆర్ఎఫ్ఐడీ) ట్రాకింగ్‌ను అమలులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా నగరంలోని కమర్షియల్ జోన్లలో ఈ సాంకేతికతతో చెత్తను సేకరిస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ)తో అనుసంధానం చేసి చెత్త సేకరణ ఇళ్లను గుర్తిస్తున్నారు. దీనివల్ల ప్రతి రోజూ ఎన్ని గృహాల నుంచి చెత్త సేకరిస్తున్నారనే లెక్కలు పక్కాగా తేలనున్నాయి. ఏప్రాంతం నుంచి ఎక్కువ చెత్త వస్తున్నదనే సమాచారాన్ని తెలుసుకోనున్నారు.

***11వేల షాపులకు స్కానర్లు***

కమర్షియల్ జోన్లలో అమలు చేస్తున్న ఆర్ఎఫ్ఐడీ ట్రాకింగ్‌లో భాగంగా 11వేల షాపులకు స్కానర్లు ఏర్పాటు చేశారు. దీంతో పాటు చెత్త సేకరించే కార్మికులకు ఐసీసీసీ ప్రతినిధులు ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్ యంత్రాలను అందజేశారు. వారం రోజులుగా వీరు చెత్తను సేకరించిన తర్వాత ట్యాగ్ మిషన్ ద్వారా షాపు ముందున్న ట్యాగ్‌ను స్కాన్ చేస్తున్నారు. దీంతో ప్రతిరోజూ ఎన్ని షాపుల నుంచి చెత్త సేకరణ జరుగుతున్నదన్న సమాచారం ఐసీసీసీకి అందుతున్నది.


***త్వరలో ప్రతి ఇంటికి..***

ప్రయోగాత్మకంగా కమర్షియల్ జోన్‌లో అమలు చేస్తున్న చెత్త సేకరణ ట్రాకింగ్ విధానాన్ని త్వరలో గ్రేటర్‌లోని అన్ని డివిజన్లలో అమలు చేయనున్నారు. కొత్త పద్ధతి అమలు తీరును పరిశీలించిన తర్వాత ప్రతి ఇంటికి ట్యాగ్ ఏర్పాటుచేసి చెత్త సేకరించనున్నారు. స్వచ్ఛ ఆటోకు కేటాయించిన గృహాల నుంచి చెత్త సేకరణ జరిగిందా? లేదా అనే విషయం ట్రాకింగ్ ద్వారా తెలియనుంది.

### ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణే లక్ష్యం

గ్రేటర్‌లోని ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చేయాలన్న లక్ష్యంతో ముందుకు పోతున్నాం. స్మార్ట్‌సిటీలో భాగంగా తప్పనిసరిగా ఇంటింటి నుంచి చెత్త సేకరణ జరగాల్సి ఉంది. వంద శాతం సేకరించడంలో భాగంగానే ఆర్ఎఫ్ఐడీ ట్రాకింగ్ పద్ధతిని తీసుకువచ్చాం. ప్రస్తుతం 11వేల షాపులకు స్కానర్లు ఏర్పాటు చేసి చెత్త సేకరిస్తున్నాం. త్వరలోనే గ్రేటర్ అంతా ఈ విధానాన్ని అమలు చేస్తాం.

– డాక్టర్ రాజేశ్, చీఫ్ మున్సిపల్ హెల్త్ అధికారి



## హనుమకొండలో ఈఫిల్ టవర్

బాలసముద్రం జంక్షన్‌లో మినీ టవర్ ఏర్పాటు

వరంగల్, ఆగస్టు 16 : నగరంలోని బాలసముద్రం జంక్షన్‌లో ఈఫిల్ టవర్‌ను ఏర్పాటు చేశారు. వరంగల్‌లో రూ.6కోట్లతో 19 జంక్షన్లను సుందరీకరిస్తున్నారు. ఈ జంక్షన్లలో పలు ఐకాన్ల ఏర్పాటుకు సివిల్ పనులు వేగంగా సాగుతున్నాయి. దీనిలో భాగంగా బాలసముద్రం జంక్షన్‌లో శుక్రవారం మినీ ఈఫిల్ టవర్‌ను ఏర్పాటు చేశారు. అలంకార్ జంక్షన్‌లో డోలుపై నృత్యకారిణుల విగ్రహం పెట్టారు. ఫాతిమా జంక్షన్‌లో ఇద్దరు చిన్నారులు స్కిప్పింగ్, చదువుకుంటున్న బొమ్మలు, ఎస్ఎన్ఎం క్లబ్ జంక్షన్‌లో చెయ్యి బొమ్మలు నిర్మించారు. టీటీడీ కల్యాణ మండపం జంక్షన్‌లో శంఖువులోని నీరు ప్రవహించే కళాఖండాన్ని ఏర్పాటు చేయనున్నారు. వడ్డేపల్లి చెరువు వద్ద కొంగల బొమ్మలు ఇలా నగరంలో సుందరీకరణ పనులను బల్దియా అధికారులు వేగంగా చేస్తున్నారు.

హనుమకొండలో ఈఫిల్ టవర్ నమూనాను ఏర్పాటు చేసిన బల్దియా అధికారులు

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

■ విషజ్వరాలను ప్రాంతాల వారీగా గుర్తించాలి
■ వైద్యాధికారులు సమన్వయంతో పనిచేయాలి
■ వరంగల్ కలెక్టర్ సత్య శారద
■ ఎంజీఎంహెచ్, కేఎంసీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్ల సందర్శన



ఎంజీఎం వైద్యాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ డాక్టర్ సత్యశారద

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 16: ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కుగా ఉన్న ఎంజీఎం దవాఖానలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె ఎంజీఎంహెచ్‌తోపాటు కాకతీయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను సందర్శించారు. దవాఖానల్లో మౌలిక వసతులు, మందుల నిల్వలు, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఎంజీఎం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ చిలుక మురళి, ఆర్ఎంవో డాక్టర్ కోడం మురళి, విభాగాధిపతులను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ హాస్పిటళ్లలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సమన్వయంతో ముందుకెళ్లాలని కలెక్టర్ వైద్యులకు సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు ఉత్తర తెలంగాణవ్యాప్తంగా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాలు ఏ ప్రాంతం నుంచి ఎక్కువగా నమోదవుతున్నాయనే వివరాలను అందించాలన్నారు. దవాఖానల్లో సరిపడా మందుల నిల్వలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. హాస్పిటల్ విస్తీర్ణం ప్రకారం 120 కెమెరాలు అవసరం ఉన్నాయని, ప్రస్తుతం 45 కెమెరా లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. త్వరలోనే నిధులు మంజూరు చేస్తామన్నారు. దవాఖాన ఆస్తుల రక్షణ, రోగుల భద్రతా విషయంలో సెక్యూరిటీ సంస్థ బాధ్యత వహించాలని, జూనియర్ డాక్టర్లతోపాటు సెక్యూరిటీ, శానిటరీ, పేషెంట్ కేర్ సిబ్బందికి వేర్వేరుగా భద్రతా అంశాలపై కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం కేఎంసీ, కాకతీయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ని సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. ఎంజీఎం హెచ్‌లో ల్యాబ్‌లో యంత్రాల కొరత తీర్చేందుకు విభాగాల వారీ గా ల్యాబ్ సేవలను సూపర్ స్పెషాలిటీకి మార్చడానికి గల అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు.

## విషజ్వరంతో నిండు గర్భిణి మృతి

### పురిటిలోనే తల్లిని కోల్పోయిన బిడ్డ



లక్ష్మి(ఫైల్)

వాజేడు ఆగస్టు 16 : మండల పరిధిలోని కొంగాల గ్రామానికి చెందిన మొడెం లక్ష్మి(27) విషజ్వరంతో బాధ పడుతూ గురువారం సాయంత్రం మృతి చెందింది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. కొంగాల గ్రామానికి చెందిన మొడెం ప్రసాద్ భార్య లక్ష్మి నిండు గర్భిణిగా ఉన్న క్రమంలో తొమ్మిది రోజుల క్రితం జ్వరం సోకింది. దీంతో వాజేడులో రెండు రోజులు వైద్యం పొందింది. జ్వరం తగ్గకపోవడంతో ఏటూరునాగారంలో మరో నాలుగు రోజులు వైద్యం చేయించుకుంది. అయితనా జ్వర తీవ్రత తగ్గక పోవడంతో వరంగల్ ఎంజీఎంకు వెళ్లగా అక్కడ రెండు రోజుల పాటు వైద్యులు చికిత్స అందించారు. అయినా తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఆమెను అంబులెన్సులో భద్రాచలానికి తరలించారు. లక్ష్మి నిండు గర్భిణి కావడంతో భద్రాచలంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో సిజేరియన్ చేసి బిడ్డను కాపాడారు. చికిత్స పొందుతూ లక్ష్మి మృతి చెందింది. కాగా, మోడెం లక్ష్మి మృతితో పుట్టిన బిడ్డ తల్లిప్రేమకు దూరమైంది. తక్కువ బరువుతో పుట్టిన బిడ్డకు భద్రాచలం ఏరియా వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. అయితే, జ్వరాలు సోకి వరుసగా మృతి చెందుతుండడం తో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. కొంగాల పంచాయతీ పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన బొగ్గుల కాంచన (48) ఇటీవల విషజ్వరంతో భద్రాచలంలో చికిత్స పొందుతూ మృతి చెందింది. తాజాగా కొంగాలకు చెందిన లక్ష్మి కూడా మృతి చెందడంతో స్థానికులు ఆందోళన పడుతున్నారు. పక్క పక్క గ్రామాల్లో ఇద్దరు విష జ్వరంతో మృతి చెందిన నేపథ్యంలో జ్వరాలపై ఆందోళన నెలకొన్నది. ఈ విషయంపై వాజేడు వైద్యాధికారి మహేందర్‌ను వివరణ కోరగా లక్ష్మి స్థానిక పీహెచ్‌సీలో చికిత్స తీసుకుంటున్నప్పుడు టైఫాయిడ్ లక్షణాలుండడంతో ఆమెను ఏటూరునాగారం సీహెచ్‌సీకి రెఫర్ చేసి స్వయంగా పర్యవేక్షించినట్లు తెలిపారు. వారి కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు డీఎహెచ్‌వో చొరవతో వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు తెలిపారు. రెండు రోజుల అనంతరం వారు తమ మాట వినకుండా అక్కడి నుంచి భద్రాచలం ప్రైవేట్ వైద్యాశాలకు తీసుకొని వెళ్లారని వివరించారు.

## తీగలు కిందకు.. తగిలితే షాకు!

పత్తి చేనులో విద్యుత్ తీగలు ఇలా కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. గాలిదుమారానికి విద్యుత్ స్తంభం ఒరిగి నెల రోజులైనా ఇప్పటికీ సరిచేయలేదు. దీంతో భయంభయంగా చేనుకు పురుగు మందు కొట్టాల్సి వస్తున్నదని రైతు బోడ రాజు ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు. ఆదమరిస్తే ప్రజలతో పాటు మూగజీవాలు విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉందని, వెంటనే అధికారులు స్పందించి తీగలను సరిచేయాలని రైతులు కోరుతున్నారు. –నెక్కొండ, ఆగస్టు 16





పత్తి చేనులో ప్రమాదరకరంగా విద్యుత్ స్తంభం



ములుగుకు వచ్చే జాకారం మంచినీటి బావి

■ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో పక్కకు పడేసిన పైపులైన్
■ మరమ్మతులకు నిధులు లేక చేతులెత్తేసిన జీపీ
■ సరిపడా రాని మిషన్ భగీరథ నీరు
■ 20 రోజులుగా నీటికి కటకటలాడుతున్న కాలనీవాసులు



ధ్వంసమైన పైపులైన్

# కాంట్రాక్టర్ నిర్వాకం.. నల్లాలు బంద్

ములుగు, ఆగస్టు16(నమస్తేతెలంగాణ): జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిర్వాకంతో ములుగు జిల్లా కేంద్రంలోని పలు కాలనీలకు నల్లాలు బందయ్యాయి. దీంతో 20 రోజులుగా ప్రజలు తాగు నీరు, గృహ అవసరాలకు ఇబ్బందులు పడుతున్నారు. 20 ఏళ్ల క్రితం ములుగు గ్రామానికి మంచినీటి అందించేందుకు జాకారం గ్రామపంచాయతీ పరిధిలో ప్రత్యేకంగా మంచినీటి బావిని తవ్వించి గట్టమ్మ ఆలయం వద్ద వాటర్ ట్యాంకును నిర్మించారు. అక్కడి నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేసి జీపీ ఆధ్వర్యంలో నల్లాల ద్వారా మంచినీటిని అందించారు. ఆరేళ్ల క్రితం మిషన్ భగీరథ నల్లాలు బిగించిన తర్వాత అన్ని కాలనీలకు మిషన్ భగీరథ నీళ్లు వస్తు న్నాయి. అయితే ప్రేమ్‌నగర్, వీవర్స్‌కాలనీ, గొల్లవాడ, ఎస్సీ కాలనీ, ప్రగతినగర్ కాలనీ ప్రజలకు ఈ నీటితో పాటు పాత పైప్ నుంచి వచ్చే జాకారం నీళ్లు కూడా సరఫరా అవుతుండగా, దీన్నే వారు తాగునీరుగా ఉపయోగిస్తున్నారు. గట్టమ్మ మూల మలుపు వద్ద ఎన్‌హెచ్ విస్తరణ పనుల్లో భాగంగా అడ్డుగా వచ్చిన జాకారం పైప్‌లైన్‌ను జేసీబీతో తీసి పక్కకు పడేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో 20 రోజులుగా పలు కాలనీలకు జాకారం మంచి నీరు సరఫరా కావడం లేదు. మిషన్ భగీరథ నీళ్లను గృహ అవసరాలకు మాత్రమే వినియోగిస్తున్నారు. పైగా అవి చాలినన్ని రావడం లేదు. పైపులైన్‌కు మరమ్మతులు చేయాలంటే రూ.3లక్షల వరకు ఖర్చవుతుందని, ప్రస్తుతం జీపీలో నిధులు లేవని అధికారులు పేర్కొంటున్నారు. భగీరథ నీటిని పశువులు, గొర్రెలకు అందించబోమని ఆ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వారు తెలుపుతున్నారు. కలెక్టర్ స్పందించి మంచినీటి పైప్‌లైన్‌ను సంబంధిత కాంట్రాక్టర్‌తో మరమ్మతులు చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



జాతీయ రహదారి విస్తరణ పనుల సందర్భంగా పైపులైన్‌ను తొలగించి పక్కకు వేసిన సిబ్బంది

■ మరో మహిళ పరారీ
■ మెడికల్ కళాశాలలో ఉద్యోగాలిప్పిస్తానని డబ్బుల వసూలు

## ఇద్దరు నకిలీ ఏజెంట్ల పట్టివేత



నర్సంపేటలో అదుపులోకి తీసుకున్న ఏజెన్సీ సభ్యులు

నర్సంపేట, ఆగస్టు16: నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలిప్పిస్తామని డబ్బులు వసూలు చేసిన ఇద్దరు నకిలీ ఏజెంట్లను పట్టుకున్నారు. వైద్య కళాశాలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకాన్ని నవోదయ ఏజెన్సీకి అప్పగించారు. అయితే ఉద్యోగాల నియామకం కోసం డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. దీంతో కలెక్టర్ విచారణ జరిపించగా డబ్బులు వసూలు చేసినట్లు విచారణలో తేలింది. ఈ క్రమంలో నవోదయ ఏజెన్సీ సభ్యులు పథకం ప్రకారం డబ్బులు వసూలు చేస్తున్న వారిని వలపన్ని పట్టుకున్నారు. ఉద్యోగం ఇప్పించాలని ఒకరితో ఫోన్ చేయించగా మూడు రోజుల నుంచి తిప్పుకుంటున్నారు. చివరికి శుక్రవారం కలిసి రూ.10 వేలు తీసుకున్నారు. అనంతరం ఇద్దరిని పట్టుకొని పోలీసులకు అప్పగించామని, ఓ మహిళ పరారైనట్లు నవోదయ ఏజెన్సీ నిర్వాహకుడు కుమార్ తెలిపారు.











